
సాక్షి
అనంతపురం
శనివారం । 10 । మే । 2025



జిల్లాకు వర్ష సూచన

రాగల ఐదు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు విజయ శంకరబాబు, జి.నారాయణస్వామి తెలిపారు.



చీనీ టన్ను రూ.23,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,200 పలికాయి.

గరిష్టం/కనిష్టం
40.8°/21.3°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తులు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామిల ఆధ్వర్యంలో మేళతాళాలతో పెన్నహోబిలం నుంచి ఊరేగింపుగా ఆమిద్యాలకు వెళ్లారు. అక్కడి పెన్నోబులేసుని ఆలయంలో ఉత్సవమూర్తులకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పల్లకీలో శ్రీవారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పెన్నహోబిలానికి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయంలో కొలువుదీర్చారు.

ముగిసిన గ్రూప్‌-1 మెయిన్స్‌

అనంతపురం అర్బన్‌: ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రారంభమైన గ్రూప్‌-1 మెయిన్స్‌ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఏడు రోజుల పాటు జరిగిన పరీక్షల్లో అభ్యర్థుల హాజరు 64.28 శాతం నమోదయ్యింది. అనంతపురంలోని పీవీకేకే ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ, శ్రీ బాలాజీ పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. పీవీకేకే కళాశాలలో 234 మంది, శ్రీ బాలాజీ కళాశాలలో 360 మంది.. మొత్తం 594 మంది అభ్యర్థులకు గాను 381 మంది హాజరయ్యారు. పరీక్షల తీరును కలెక్టర్‌ వినోద్‌కుమార్‌, జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌ శర్మ, అసిస్టెంట్‌ కలెక్టర్‌ సచిన్‌ రహర్‌ పరిశీలించారు. పరీక్షలకు లైజన్‌ అధికారులుగా డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్‌, మల్లికార్జునుడు వ్యవహరించారు.

‘పరివాహన్‌’లోనే ట్రాలీల రిజిస్ట్రేషన్‌



ఎం.వీర్రాజు, డీటీసీ

అనంతపురం సెంట్రల్‌: ట్రాక్టర్‌ ట్రాలీల రిజిస్ట్రేషన్లు ఇక నుంచి ‘పరివాహన్‌’ వెబ్‌సైట్‌లోనే జరుగుతాయని ఉప రవాణా కమిషనర్‌ (డీటీసీ) ఎం.వీర్రాజు తెలిపారు. ఇప్పటి వరకూ ఈ-ప్రగతి సైట్‌లో రిజిస్ట్రేషన్‌లు జరిగేవని, కొద్దిరోజులుగా ఇందులో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో రవాణాశాఖలో ప్రతి సేవా ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయాన్ని ట్రాలీల తయారీ డీలర్లు గమనించి ట్రేడ్‌ లైసెన్స్‌ కోసం ఆర్టీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రేడ్‌ లైసెన్స్‌ తీసుకున్న తర్వాత అందరినీ పరివాహన్‌ వెబ్‌సైట్‌లోకి మార్పు చేయనున్నట్లు తెలిపారు. ట్రాలీల రిజిస్ట్రేషన్‌లు పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

మురళీనాయక్‌ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

అనంతపురం కార్పొరేషన్‌: ఆపరేషన్‌ సిందూర్‌లో పాలుపంచుకుని పాక్‌ సైనికుల కాల్పుల్లో అసువులు బాసిన గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్‌ కుటుంబానికి మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్‌ సాకే శైలజానాథ్‌ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీనాయక్‌ మృతి ఎంతో బాధించిందన్నారు. వీర జవాన్‌ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

యుద్ధానికి సిద్ధమైన మాజీ సైనికులు



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం: అవసరమైతే యుద్ధానికి తాము కూడా సిద్ధమంటూ జిల్లా మాజీ సైనికులు తెలిపారు. యుద్ధంలో అమరుడైన మురళీనాయక్‌ చిత్రపటానికి అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కెప్టెన్‌ షేకన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వీరజవాన్‌ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం ఆర్ట్స్‌ కళాశాల నుంచి టవర్‌క్లాక్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ట్రెజరర్‌ తిమ్మారెడ్డి, కరణంకృష్ణ, బి.రవికుమార్‌, మహమ్మద్‌ గౌస్‌, బీఏ హుస్సేన్‌, సుహేల్‌, రాజగోపాల్‌, వెంకటరమణ, ఏవీ రమణ, ఐ.శ్రీనివాసులు, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వీరుడా వందనం



- దేశ సేవలో అమరుడైన మురళీ నాయక్‌
- కన్నీటిసంద్రమైన స్వగ్రామం కల్లితండా
- అతని జ్ఞాపకాలు తలచుకుని రోదిస్తున్న స్నేహితులు
- ఘన నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరులో అమరుడైన ఆర్మీ జవాన్‌ మురళీనాయక్‌ను తలచుకుని ఉమ్మడి అనంతపురం జిల్లా బోరున విలపిస్తోంది. అతని స్వగ్రామం కల్లితండా కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. జమ్మూకశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ మురళీనాయక్‌ వీరమరణం పొందిన వార్త శుక్రవారం ఉదయం 9 గంటలకు తెలియగానే ఉమ్మడి జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులతోపాటు కుటుంబీకులు, సన్నిహితులు, స్నేహితులు మురళీనాయక్‌తో తమకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు కల్లితండాకు వెళ్లి మురళీనాయక్‌ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు.



కల్లితండా.. కన్నీటి సంద్రం

- అమరుడైన బిడ్డను తలచుకుని కన్నీరుమున్నీరైన తండావాసులు

గోరంట్ల: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రుమూకలను తరిమికొడుతూ వీరోచిత పోరాటం చేసిన మురళీనాయక్‌ అమరుడయ్యారన్న విషయం తెలియగానే అతని స్వగ్రామం గోరంట్ల మండలంలోని కల్లితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 150 ఇళ్లు మాత్రమే ఉన్న తండాలో అందరూ గిరిజనులే. శుక్రవారం ఉదయం మురళీ నాయక్‌ వీరమరణం గురించి తెలియగానే తండావాసులంతా మురళీనాయక్‌ స్వగృహానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాంనాయక్‌లను ఓదార్చారు. మురళీనాయక్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని పొగిలిపొగిలి ఏడ్చారు. గ్రామంలో చిన్నాపెద్ద తేడా లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండేవాడని, అలాంటి బిడ్డ దేశం కోసం శత్రువుల చేతిలో అసువులుబాయడంతో వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి మెండుగా ఉన్న మురళీ నాయక్‌...చాలా పట్టుదల గలవాడన్నారు. తాను అనుకున్నట్లే ఆర్మీలో చేరి దేశ సేవలో అమరుడయ్యారని విలపించారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన గిరిజన ముద్దుబిడ్డ మురళీనాయక్‌ విగ్రహాన్ని మండల కేంద్రమైన గోరంట్లలో ఏర్పాటు చేయాలని అఖిల భారత బంజారా సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు కోరారు.

నమ్మలేకపోతున్నాం



మురళీనాయక్‌ దేశం కోసం ప్రాణత్యాగం చేయడం గర్వంగా ఉంది. కానీ పాతికేళ్లు కూడా లేని బిడ్డకు అప్పుడే నిండు నూరేళ్లు నిండాయంటే నమ్మలేకపోతున్నాం. ఏకైక సంతానాన్ని పోగొట్టుకున్న అతని తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. అతని వీరోచిత పోరాటం వృథా కాదని భావిస్తున్నాం.

– గోవింద నాయక్‌, కల్లితండా

దేశభక్తి ఎక్కువ



మురళీ నాయక్‌ చాలామంచి అబ్బాయి. చిన్నప్పటి నుంచి దేశ భక్తి ఎక్కువ. ఎప్పుడూ సైన్యంలో పనిచేయాలని చెప్పేవాడు. అందుకే ఎన్ని అవకాశాలు వచ్చినా సైన్యంలోనే చేరాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి దేశం కోసం ప్రాణాలు అర్పించి చరిత్రలో మిగిలిపోయాడు.

– చాంప్లానాయక్‌, కల్లితండా

సలాం సైనిక

సైన్యంలో చేరాలన్న కలను నెరవేర్చుకున్నావ్‌
పాతికేళ్లకే జీవితాన్ని దేశానికి అంకితమిచ్చావ్‌
అక్కచెల్లెమ్మల నుదుటి సిందూరం చెరిపిన..
ఉగ్రమూకలకు బదులు చెప్పావ్‌
దేశానికి కవచంలా నిలబడి వీరోచిత పోరాటం చేశావ్‌
శత్రుసేనలను చెండాడుతూ సరిహద్దులో సగర్వంగా నిలిచావ్‌
మాతృభూమి కోసం చివరి నెత్తురుబొట్టునూ చిందించావ్‌
సలాం సైనిక..
నీ త్యాగం మరువం.. నీ పోరాటం వృథా కానివ్వం
నీ రక్తాన్నే సిరాగా రాసిన చరితను వెయ్యేళ్లు చదువుకుంటాం
మువ్వన్నెల పతాకమై ఎగిరిన నీ ధైర్యం సాక్షిగా చెబుతున్నాం
ఆ పా(పి)కిస్తాన్‌ గాళ్లకు మరణశాసనం రాస్తాం
యుద్ధమంటే పోరాటం కాదని..మాతృభూమిపై
ప్రేమని చాటిచెబుతాం
జీవన రవళిలా ‘మురళి’ గానం చేస్తూనే ఉంటాం
సలాం సైనిక... సలాం

సైన్యంలో ఒక్కరోజున్నా చాలు

“నాకు ఏ ఉద్యోగం వద్దు... ఎంత కష్టమైనా ఆర్మీలోకే పోతా. బోర్డర్‌లో పని చేయడం నా కల. ఒక్కరోజు పనిచేసినా చాలు. దేశం కోసం చావనైనా చస్తా. నా శవంపై భారత జెండా కప్పాలి.”

– స్నేహితులు, సన్నిహితులతో మురళీనాయక్‌ చెప్పిన మాటలివీ..



తల్లిదండ్రులతో మురళీనాయక్‌ (ఫైల్‌)

సోమందేపల్లిలో విద్యాభ్యాసం

సోమందేపల్లి: వీర మరణం పొందిన మురళీ నాయక్‌ పదో తరగతి వరకు సోమందేపల్లిలోని విజ్ఞాన్‌ పాఠశాలలో చదువుకున్నారు. తల్లిదండ్రులు జ్యోతి బాయి, శ్రీరాంనాయక్‌ జీవనోపాధి కోసం ముంబయికి వెళ్లగా.. మురళీ నాయక్‌ సోమందేపల్లి మండలం నాగినాయిన చెరువు తండాలో అమ్మమ్మ శాంతి బాయి వద్ద ఉంటూ సోమందేపల్లిలోని విజ్ఞాన్‌ ఇంగ్లిష్‌ మీడియం పాఠశాలలో చదివారు. 2016-17 టెన్త్‌ బ్యాచ్‌కు చెందిన మురళీ నాయక్‌ చదువులో ఎప్పుడూ ముందుండేవాడు. మురళీ నాయక్‌ మృతి విషయం తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంట్‌ మల్లికార్జునతో పాటు అతని మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమతో గడిపిన జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ మురళీనాయక్‌ రాణించేవాడన్నారు. తమ తండా యువకుడు దేశం కోసం ప్రాణాలర్పించడం గర్వంగా ఉందని నాగినాయనిచెరువు తండా సర్పంచ్‌ అంజినాయక్‌, గ్రామస్తులు చెబుతున్నారు.



మురళీనాయక్‌ ఆత్మకు శాంతిచేకూరాలని అనంతపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మేయర్‌ వసీం తదితరులు

దేశభక్తి ఎక్కువగా ఉండేది



మురళి నాయక్‌ నాకు మంచి మిత్రుడు. చాలా దేశభక్తి ఉండేది. పోలీసు లేదా ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని తపన ఉండేది. వీర మరణం పొందడం గర్వకారణంగా ఉంది. మంచి మిత్రుడిని కోల్పోవడం చాలా బాధ కల్గిస్తోంది.

– చిరంజీవి, సోమందేపల్లి

క్రమశిక్షణతో చదివేవాడు



మురళీ నాయక్‌ పదో తరగతి వరకూ మా పాఠశాలలో చదివాడు. చాలా క్రమశిక్షణతో చదువుకునేవాడు. ఎటువంటి వివాదాలు లేని విద్యార్థి, దేశ భక్తి కూడా ఎక్కువగా ఉండేది. మా పాఠశాలలో చదివి దేశం కోసం ప్రాణాలు అర్పించడం గర్వంగా ఉంది.

– మల్లికార్జున, కరస్పాండెంట్‌ , విజ్ఞాన్‌ స్కూల్‌, సోమందేపల్లి

13న కల్లితండాకు వైఎస్‌ జగన్‌

- వీర జవాన్‌ కుటుంబాన్ని పరామర్శించనున్న మాజీ సీఎం



జవాన్‌ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉషశ్రీ చరణ్‌

రొద్దం: దేశ రక్షణలో అసువులు బాసిన జవాన్‌ మురళీనాయక్‌ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న కల్లితండాకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె మండల పరిధిలోని కంబాలపల్లిలో పర్యటించారు. అంతకుముందు కల్లితండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన కల్లితండా వాసి మురళీ నాయక్‌ కుటుంబీకులను ఇప్పటికే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారన్నారు. వీర జవాన్‌ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్వయంగా వస్తున్నట్లు వెల్లడించారు.

వీరమరణం పొందిన మురళీ నాయక్‌



అనంతపురం కార్పొరేషన్‌: ‘ఆపరేషన్‌ సిందూర్‌’లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్‌ వీరమరణం పొందారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. మాతృభూమి కోసం మురళీనాయక్‌ ప్రాణత్యాగం చేశారన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడం చాలా బాధగా ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రధానంగా మురళీనాయక్‌ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు

- సూపర్‌ సిక్స్‌ అమలుపై స్పష్టత ఇవ్వని సీఎం చంద్రబాబు



సీఎం ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న ప్రజలు

ఉరవకొండ/ వజ్రకరూరు: ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురుచూసిన జిల్లా ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నిరాశపరిచింది. శుక్రవారం వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనతో పాటు ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. సంపదను సృష్టించి జిల్లాను అభివృద్ధి చేస్తానని, ఇంట్లో ఎక్కువమంది పిల్లలను కని జనాభా పెంచేలా చూడాలని చెప్పడం తప్ప హామీల అమలుపై సీఎం తన ప్రసంగంలో ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. తల్లికి వందనం పథకం త్వరలోనే అమలు చేస్తామని, అన్నదాత సుఖీభవ పథకం కేంద్రం వాటా ఇచ్చిన రోజే రాష్ట్రం తరపున నిధులు విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని కొందరు మహిళలు అడిగితే.. సీఎం సమాధానం ఇవ్వలేదు. మరికొన్ని ముఖ్యమైన సూపర్‌ సిక్స్‌, తదితర పథకాల గురించి మాట్లాడకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోవడం కనిపించింది. షెడ్యూల్‌ ప్రకారం ముఖ్యమంత్రి ఉదయం 12 గంటలకు హెలిప్యాడ్‌ వద్దకు చేరుకోవాల్సి ఉండగా.. గంట ఆలస్యంగా చేరుకున్నారు. ప్రజావేదికలోకి పోలీసులు ఉదయం 9 గంటలకే ప్రజలను అనుమతించడంతో ఎండ తీవ్రతకు కూర్చోలేక అవస్థలు పడ్డారు. సభకు వచ్చిన వారికి సరిపడు తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

నిర్వాసితులకు పరిహారం మంజూరు చేస్తాం

జీడిపల్లి భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ కింద పరిహారం మంజూరు చేస్తామని, 34, 36 ప్యాకేజీ పనులు పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమిద్యాల బ్రాంచ్‌ కెనాల్‌ పూర్తి చేసి, కొట్టాలపల్లి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ మంజూరు చేస్తామన్నారు. మెగా డ్రిప్‌ ఇరిగేషన్‌ కింద 40వేల ఎకరాలకు జీడిపల్లి ద్వారా నీరు అందించి పథకాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. ఉరవకొండకు టెక్స్‌టైల్‌ పార్కు, రామసాగరం వంతెన మంజూరు చేస్తామన్నారు. జీడిపల్లి, బీటీపీ పనులకు ప్రాధ్యానత ఇచ్చి పూర్తి చేస్తామన్నారు. ఛాయాపురంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్ల నిర్మాణాలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్‌ వినోద్‌కుమార్‌, జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌శర్మ, ఎస్పీ జగదీష్‌, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అడ్డుకునేందుకు యత్నం

వజ్రకరూరు మండలం ఛాయాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను ఏబీవీపీ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. జీఓ 77ను రద్దు చేయకుండా జిల్లాలోకి అడుగుపెట్టనీయబోమని ఏబీవీపీ నాయకులు ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో వజ్రకరూరు సమీపంలో సీఎం డౌన్‌ డౌన్‌, జీఓ 77ను రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తు సీఎం సభ వద్దకు చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని చిన్న హోతురు వద్ద అరెస్టు చేసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉంచారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లోకేష్‌ ‘యువగళం’ పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 77ను రద్దు చేసి ప్రతి విద్యార్థికీ స్కాలర్‌షిప్‌ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జీఓ రద్దు చేయకుండా మోసం చేశారన్నారు. ప్రతి విద్యార్థికీ ఫీజురీయింబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్‌ ఇవ్వని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సుధీర్‌, నిఖిల్‌, తేజ, భూతరాజు, భాషి, గిరి, చంద్రశేఖర్‌, కృష్ణ పాల్గొన్నారు.



సీఎం గో బ్యాక్‌ అంటు నినదిస్తున్న నాయకులు

కక్ష సాధింపుపై కన్నెర్ర

- సాక్షి ఎడిటర్‌ ఇంట్లో సోదాలు పత్రికాస్వేచ్ఛను హరించడమే
- అనంతలో జర్నలిస్టుల నిరసనాగ్రహం



అనంతపురంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అనంతపురం: మీడియాపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపులకు దిగడంపై జర్నలిస్టులు కన్నెర్ర జేశారు. అక్రమ కేసులు పెడుతూ, ఖాకీలతో దాష్టీకానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. ‘సాక్షి’ ఎడిటర్‌ ఆర్‌.ధనంజయరెడ్డి నివాసంలో గురువారం పోలీసులు సోదాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెర్చ్‌ వారెంట్‌ లేకుండా అక్రమంగా ఇంట్లోకి చొరబడి వ్యవహరించిన తీరును తప్పుపట్టారు. ప్రజాస్వామ్య పాలనలో ఇదో మాయని మచ్చగా అభివర్ణించారు. ప్రభుత్వం, పోలీసుల తీరుకు నిరసనగా ‘సాక్షి’ బ్యూరో ఇన్‌చార్జ్‌ గుండం రామచంద్రారెడ్డి (ఆర్‌సీఆర్‌), సాక్షి ఎడిషన్‌ ఇన్‌చార్జ్‌ తోలేటి మహేశ్వరరెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్‌ శివారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్‌ కార్యాలయ సమీపంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, జాప్‌ జిల్లా అధ్యక్షుడు బండి సుబ్రహ్మణ్యంరెడ్డి, మన అనంతపురం పత్రిక ఎడిటర్‌ తోట నాగరాజు, సీనియర్‌ జర్నలిస్టులు రమణ, శ్రీకాంత్‌, ఆత్రేయ కృష్ణారెడ్డి, ప్రముఖ కవి రియాజుద్దీన్‌ అహమ్మద్‌ తదితరులు సంఘీభావం తెలిపారు.

సోదాలు అప్రజాస్వామిక చర్య



రాష్ట్రంలో ప్రముఖ దినపత్రిక ఎడిటర్‌పై వేధింపులకు పాల్పడటం చరిత్రలో ఇదే తొలిసారి. అసలు రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ఉందా? విలేకరులపై దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. సాక్షి ఎడిటర్‌ ఆర్‌.ధనంజయరెడ్డి ఇంటిపై సెర్చ్‌ వారెంట్‌ లేకుండా సోదాలు చేయడం అప్రజాస్వామిక చర్య. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసు అధికారులపై కేసులు పెడతాం. ప్రెస్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియాకు ఫిర్యాదు చేస్తాం.

– మచ్చా రామలింగారెడ్డి, ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు

సంఘటితంగా పోరాడాలి



సాక్షి ఎడిటర్‌ ధనంజయరెడ్డి ఇంట్లో సెర్చ్‌ వారెంట్‌ లేకుండా పోలీసులు సోదాలు చేసి అవమానపరిచారు. సంబంధం లేకుండా పత్రికా సంపాదకులను ఇలా ఇబ్బంది పెట్టడం ఎంత వరకు న్యాయం? అక్రమ కేసులు, దాడులపై జర్నలిస్టులు అందరూ సంఘటితంగా పోరాడాలి.

– గుండం రామచంద్రారెడ్డి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్‌

వార్తలు వస్తే కేసులా..?



పత్రికల్లో వార్తలు రాస్తే కేసులు నమోదు చేయడం పాత్రికేయుల నైతిక బలాన్ని హరించాలని చూడడమే. కోర్టులో కేసు నడుస్తుండగా, కనీసం నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్‌ ధనంజయరెడ్డి ఇంటిలో సోదాలు చేయడం బాధాకరం. పోలీస్‌ శాఖ అనైతిక చర్యలకు దిగడం ప్రజాస్వామ్యంలో మీడియాకు గొడ్డలిపెట్టు వంటిది. ప్రజాస్వామ్యవాదులు, మీడియా స్వేచ్ఛ, భావ ప్రకటనాస్వేచ్ఛ కోరుకునే వారందరూ ఇలాంటి ఘటనలను ఖండించాలి.

–బండి సుబ్రహ్మణ్యంరెడ్డి, ‘జాప్‌’ జిల్లా అధ్యక్షుడు

కక్ష సాధింపు తగదు



మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ/వజ్రకరూరు: కూటమి ప్రభుత్వ పాలనలో లోటుపాట్ల గురించి ‘సాక్షి’లో కథనాలు ప్రచురితమైతే.. వాటిని సరిదిద్దుకునేది పోయి పత్రిక ఎడిటర్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగడం సబబు కాదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షి దినపత్రిక ఎడిటర్‌ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సోదాలు చేపట్టడాన్ని ఖండించారు. ఇది పత్రికాస్వేచ్ఛపై దాడిగా భావించాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి పోలీసులు తమ వ్యవస్థకున్న ప్రతిష్టను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలనుకోవడం కూటమి నేతల అవివేకానికి నిదర్శనమన్నారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ



రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కుందుర్పి సమీపంలో గురువారం చోటు చేసుకున్న ప్రమాదంలో మృతి చెందిన కరిగానపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజు కుటుంబసభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య శుక్రవారం పరామర్శించారు. కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీలో ఉన్న రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మండల కన్వీనర్లు హనుమంతురాయుడు, గోళ్ల సూరి, మండల మాజీ కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ విజయ్, నాయకులు పెద్దావలి, లింగప్ప, తిప్పేస్వామి, రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

'ఎన్ఐసీ'కి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి



గాదిలింగను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మయ్య

గుంతకల్లు టౌన్: కర్ణాటకలోని బెల్గాంలో ఉన్న రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ జరిగే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ (ఎన్ఐసీ)కు గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి గాదిలింగ ఎంపికయ్యాడు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి టౌన్: స్థానిక రజక కల్యాణ మంటపం సమీపంలో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (58) మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. పట్టణంలో భిక్షాటనతో జీవించేవాడై ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

ఆలోచన నుంచి ఆవిష్కరణ వరకూ

- 'అనంత'లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 5 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- అప్పటి వరకూ జేఎన్‌టీయూ(ఏ) పాత పాలక భవనంలో నిర్వహణ



అనంతపురంలో నిర్మించనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నమూనా

అనంతపురం: యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించే దిశగా అనంతపురంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' పేరుతో ఇన్నోవేషన్ ప్రాంతీయ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ కేంద్రంగా ఏర్పాటు కానున్న రతన్ ఇన్నోవేషన్ హబ్‌కు అనుబంధంగా ఎన్టీఆర్ జిల్లా, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ హబ్ (హబ్ స్పోక్ సెంటర్)లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిధిలోని ఐదు ఎకరాల్లో శాశ్వత భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. భవనాలు అందుబాటులో వచ్చే వరకూ తాత్కాలికంగా జేఎన్‌టీయూ (ఏ) పాత పాలక భవనం నుంచి కార్యకలాపాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రైవేట్ సంస్థల పర్యవేక్షణలో..

ప్రాంతీయ హబ్‌ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలు పర్యవేక్షించనున్నాయి. సీడ్ క్యాపిటల్‌ను ప్రభుత్వం అందిస్తుంది. అనంతపురంలో ఏర్పాటు కానున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు ఇండస్ట్రియల్ భాగస్వాములుగా కియా కంపెనీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీ వ్యవహరించనున్నాయి. నాలెడ్జ్ భాగస్వాములుగా జేఎన్‌టీయూ (ఏ), సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ అనంతపురం కీలకంగా వ్యవహరించనున్నాయి. హబ్‌లు పూర్తిస్థాయిలో పనిచేసే వరకూ జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో డీఐసీ జీఎం, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సభ్యులుగా ఉంటారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్‌ల లక్ష్యంగా ఈ హబ్ పనిచేయనుంది.

సెక్షన్ ఫారం 8 కంపెనీగా నమోదు

రతన్‌టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ హబ్‌ను సెక్షన్ ఫారమ్ 8 కంపెనీగా నమోదు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్షిప్ (పీపీపీ) మోడల్ నమోదుపై చర్చ జరిగింది. పరిశ్రమలతో మెమొరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంఏఓ), ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ (ఏఓఏ)ను ఈ సందర్భంగా ఏర్పాటు చేయనున్నారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులతో ఓ కమిటీ ఏర్పాటు చేసి, వ్యూహాత్మక నిర్ణయాలను పరిశీలించాలనే ప్రతిపాదన కూడా ఉంది.

నూతన ఆవిష్కరణలకు దన్నుగా..



విద్యార్థి ఆలోచన ఏదైనా సరే దాని ఆవిష్కరణకు రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ హబ్ దోహదపడుతుంది. కంపెనీ రిజిస్ట్రేషన్ సులభతరంగా నిర్వహించడంతో పాటు ఇందుకు అయ్యే ఖర్చునూ హబ్ భరిస్తుంది. నూతన ఆవిష్కరణలకు అవసరమైన సాంకేతిక శిక్షణను అందిస్తారు. ఈ ప్రాజెక్ట్‌లో జేఎన్‌టీయూ (ఏ) భాగస్వామిగా ఉండడం గర్వకారణం.

–ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

'జర్నలిస్టుల స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటు'

అనంతపురం కల్చరల్: కక్షపూరితంగానే సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిని పోలీసులు అవమానించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి వారెంట్లు లేకుండా సోదాలు చేపట్టడం పోలీసు ప్రతిష్ట దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వాస్తవాలను ప్రచురించకుండా భయపెడుతున్న ప్రభుత్వ విధానాలు అభ్యంతరకరమన్నారు. న్యాయస్థానం సుమోటోగా కేసు స్వీకరించి, పోలీసు అధికారులను విచారణ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే చట్టానికి, న్యాయనికి విలువలు లేని రోజులు వచ్చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను, పత్రికా స్వేచ్ఛను మంటకలుపుతున్న విధానాలను ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారన్నారు.

పత్రికా స్వేచ్ఛపై పోలీసుల దాడి దుర్మార్గం

- భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్



అనంతపురం ఎడ్యుకేషన్: పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం అత్యంత దుర్మార్గమని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విజయవాడలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు చేపట్టిన తనిఖీలను తప్పుబట్టారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరిచే కథనాలు ప్రచురించే మీడియాపైనే ఇంతకు దిగజారితే... ఇక ప్రశ్నించే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారంలో, ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విషయాలను సాక్షి పత్రిక రోజూ అనేక కథనాలతో వెలుగులోకి తెస్తోందన్నారు. వాస్తవాలను జీర్ణించుకోలేని ప్రభుత్వం సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంపై పోలీసులతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం అవివేకమన్నారు. నిజాలు వెలుగులోకి రానీయకుండా గొంతునొక్కే ప్రయత్నంగానే దీనిని భావించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు రాజ్యాంగం, చట్ట ప్రకారం వ్యవహరించకపోతే ప్రజల తీవ్ర వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సాక్షి ఎడిటర్ నివాసంలో సోదాలు చేసిన పోలీసు అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- ధర్నాలో ఏపీటీఎఫ్ నాయకులు



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాలతో రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందని, ఇదే తీరు కొనసాగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కూటమి సర్కార్‌ను ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. పాఠశాలల పరిరక్షణ, పీఆర్సీ, మధ్యంతర భృతి, డీఏ మంజూరు అంశాలపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, పూర్వపు అధ్యక్ష, కార్యదర్శులు రఘురామిరెడ్డి, నరసింహులు మాట్లాడారు. దశాబ్దాల నుంచి అమలులో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాల వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. ఫౌండేషన్ పాఠశాలల పేరుతో ప్రాథమిక పాఠశాలల స్థానంలో ఒకటి, రెండు తరగతులకు మాత్రమే పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఒక్కొక్క రకమైన పాఠశాలలో ఒక్కో విధమైన అశాస్త్రీయ విధానాలను అవలంభిస్తూ ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పాటిస్తోందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, మూడు పెండింగ్ డీఏల మంజూరులో ఆలస్యాన్ని ఇకపై ఉపేక్షించబోమన్నారు. రెండవ దశ పోరాటంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించినట్లుగా తెలిపారు. మూడవ దశలో భాగంగా రాష్ట్రస్థాయిలో ఈ నెల 14న ధర్నా తలపెట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాయి నాగరాజు, డేనియల్ మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, సతీష్‌కుమార్, సర్దార్‌వలి, వెంకటరమణ, శ్యాం, రవి, కృష్ణ, లక్ష్మీప్రసాద్, ప్రేమావతి, అంజలీదేవి, వన్నప్ప, బాలరామ్మోహన్, ఓబులేసు, శ్రీనివాసులు, నాగభూషణం, శ్రీనివాసులు, సూర్యనారాయణ, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా టీచర్ల సీనియార్టీ జాబితా

- జూనియర్లను సీనియర్లుగా చూపించిన అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీల నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎం పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ తయారు చేసిన సీనియార్టీ జాబితాలో తప్పులు మీద తప్పులు చేస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఎన్నిమార్లు వినతిపత్రాలు అందజేసినా ఉపయోగం లేకుండా పోయింది. తప్పుల తడకగానే రూపొందిస్తున్నారు. జూనియర్లను సీనియర్లుగా చూపిస్తున్నారు. తమకు అన్యాయం జరుగుతోందంటూ సీనియర్లు గగ్గోలు పెడుతున్నారు. సీనియార్టీ జాబితాలు తయారు చేసిన విద్యాశాఖ పరిశీలనకు వెబ్‌సైట్‌లో ఉంచారు. అన్ని కేడర్ల సీనియారిటీ లిస్టులు తప్పుల తడకగా ఉన్నాయని టీచర్లు వాపోతున్నారు. ఉపాధ్యాయుల సమగ్ర సమాచారం (టిస్) కార్యాలయంలోనే ఉంటుంది. అయినా సీనియార్టీ జాబితాల్లో తరచూ తప్పులు దొర్లుతుండడంపై మండిపడుతున్నారు. ప్రతిసారి తాత్కాలిక జాబితాలు తయారు చేయడం...టీచర్లు వాటిపై అభ్యంతరాలు తెలపడం పరిపాటిగా మారుతోంది తప్ప పరిష్కారం కావడం లేదంటున్నారు. విద్యాశాఖ అధికారులు జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచిన ప్రతిసారి మారుమూల ప్రాంతాల నుంచి అభ్యంతరాలపై ఫిర్యాదులు చేసేందుకు జిల్లా కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి సీనియార్టీ జాబితాలను తయారు చేయాలని కోరుతున్నారు.

పొరబాట్లు సరిదిద్దాలి

'టిస్' సమాచారం విద్యాశాఖ అధికారుల వద్ద అందుబాటులో ఉన్నా...సీనియార్టీ జాబితాలో తప్పులు జరుగుతూనే ఉన్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు వాపోయారు. జూనియర్లను సీనియర్లుగా చూపించారంటూ బాధిత టీచర్లు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా వాటిని సవరించడం లేదన్నారు. పారదర్శకంగా జాబితాలను తయారు చేసి సీనియార్టీలో ఏ ఒక్క టీచరూ నష్టపోకుండా చూడాలని కోరారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన రామసుబ్బయ్య (46)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కోటంకలో జరిగిన బంధువుల ఇంట శుభకార్యానికి హాజరైన ఆయన కార్యక్రమం ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. స్వగ్రామానికి చేరువకాగానే ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి కిందపడడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు 108 ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

దళిత రైతుల పురోగతికి సాంకేతిక పరిజ్ఞానం



ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న ప్రొఫెసర్లను అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జిల్లాలోని దళిత రైతుల పురోగతికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్ట్ నిర్వహణను జేఎన్‌టీయూ(ఏ) దక్కించుకుంది. డిపార్ట్‌మెంటల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యూఢిల్లీకి చెందిన సీడ్ (సైన్స్ ఫర్ ఈక్విటీ, ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్) విభాగం ద్వారా అమలవుతున్న ఎస్సీ (షెడ్యూల్ కాస్ట్) హబ్ కింద రూ.47,62,047 నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌ను జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసర్ ఎస్. చంద్రమోహన్‌రెడ్డి, కెమికల్ విభాగం ప్రొఫెసర్ బి.దిలీప్‌కుమార్, ఎలక్ట్రికల్ విభాగం డాక్టర్ జి. మమత నిర్వహించనున్నారు. మూడేళ్ల గడువున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వేరుశనగ ద్వారా నూనె, స్నాక్స్, టమాట ద్వారా సాస్, డ్రై టమాట వంటి విలువ జోడింపు ఉత్పత్తుల తయారీకి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే రైతులకు మార్కెట్ లింకేజీలు, నిల్వ సౌకర్యాలు, ఉత్పత్తుల బ్రాండింగ్ వంటి అంశాలపై మద్దతునివ్వనున్నారు. ప్రత్యేకంగా దళిత రైతులకు నైపుణ్య శిక్షణా శిబిరాలు, వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు, మార్కెట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ సందర్భంగా పరిశోధక బృందాన్ని శుక్రవారం జేఎన్‌టీయూ వీసీ హెచ్.సుదర్శనరావు అభినందించారు.

విజిలెన్స్ అధికారినంటూ యువతికి వల

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి 40 గ్రాముల బంగారం అపహరణ

చిలమత్తూరు: విజిలెన్స్ అధికారిగా పరిచయం చేసుకున్న వ్యక్తి పెళ్లి పేరుతో ఓ యువతిని వంచనకు గురి చేశాడు. ఆమె వద్ద ఉన్న బంగారు నగలు అపహరించాడు. వివరాలు.. చిలమత్తూరు మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన యువకుడు వడ్డె నరేష్ మ్యాట్రిమోనీ సైట్‌లో ఓ ప్రొఫైల్ తెరిచి తాను విజిలెన్స్ అధికారినంటూ నమోదు చేశాడు. అదే మ్యాట్రిమోనీ సైట్‌లో బెంగళూరులోని తన అక్క ఇంట్లో ఉంటూ ఓ కంపెనీలో బీపీఓగా పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన ఓ యువతి కూడా తన వివరాలు పొందుపరిచింది. వివరాలు పరిశీలించిన వడ్డె నరేష్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ప్రభుత్వం ఉద్యోగి అని నమ్మిన యువతి విషయాన్ని తన సోదరికి వివరించి పెళ్లికి అంగీకారం తెలిపింది. కొన్ని రోజుల తర్వాత ఆమెకు మంచి ఉద్యోగం చూశానని ఇందుకు రూ.2 లక్షలు డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉందని తెలిపాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేకపోవడంతో పెళ్లి కోసం సిద్ధంగా ఉంచుకున్న 40 గ్రాముల బంగారాన్ని అప్పగించింది. ఆ నగలను కర్ణాటకలోని బాగేపల్లిలో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో నరేష్ తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకుని, పత్తా లేకుండా పోయాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో చివరకు సదరు యువతి చిన్నపరెడ్డిపల్లికి చేరుకుని నిలదీసింది. పెళ్లికి నిరాకరించడంతో శుక్రవారం చిలమత్తూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మొత్తం నలుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. యువతి బంగారాన్ని రికవరీ చేయించి అప్పగించారు. కాగా, ఇదే తరహాలో అనంతపురానికి చెందిన ఓ యువతికి గతంలో టోకరా వేసినట్లుగా చర్చ సాగుతోంది. కాగా, ఘటనపై పోలీసుల ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అధికారులు, ప్రజాప్రతినిధులు లేకుండానే ప్రారంభోత్సవం



పంపనూరు సచివాలయాన్ని ప్రారంభించిన టీడీపీ నేతలు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంత మాత్రం విలువ లేదని తేలిపోయింది. ఇందుకు ఆత్మకూరు మండలం పంపనూరులో సచివాలయ భవన ప్రారంభోత్సవమే నిదర్శనం. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ లేకుండానే శుక్రవారం స్థానిక టీడీపీ నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ప్రభుత్వాధికారులు వాపోతున్నారు. ఎంపీపీకు, సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా కార్యాలయ భవనాన్ని ప్రారంభించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. శిలాఫలకంలో తహసీల్దార్, ఈఓఆర్డీ, పంచాయతీ సెక్రటరీ పేర్లు లేకపోవడం కూడా విమర్శలకు తావిచ్చింది. దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం: మద్యం సేవించడం మానలేక జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న ఇగవే పరుశురాం (34)కు భార్య చంద్రకళ, ఓ కుమారుడు ఉన్నారు. పాత చీరల వ్యాపారం చేసే వారి వద్ద కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన నాలుగేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. కూలీ పనులతో సంపాదించిన డబ్బు మొత్తం తాగుడుకే ఖర్చు పెట్టేవాడు. దీంతో సంసారం గడవడం కష్టమైంది. ఇప్పటికీ ఐదు నెలల ఇంటి అద్దెలు కూడా చెల్లించలేకపోయాడు. మూర్ఛ వ్యాధి తిరగబెడుతుండడంతో ఇటీవల ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాడు. మద్యం మానేస్తే నయమవుతుందని వైద్యులు తెలపడంతో దిక్కుతోచలేదు. మద్యం లేకపోతే తాను చనిపోతానంటూ కుటుంబసభ్యులతో చెప్పుకునే వాడు. ఆ సమయంలో కుటుంబసభ్యులు సముదాయిస్తూ వచ్చేవారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం అతిగా జ్వరం బారిన పడ్డాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి బెడ్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కూటమి ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లాకు విచ్చేసిన ఆయన శుక్రవారం స్థానిక రెవెన్యూ సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయకపోవడం, డీఏ ప్రకటించకపోవడం, డీఏ, పీఆర్సీ ఆరియర్లపై స్పష్టత లేకపోవడం, మధ్యంతర భృతి ఊసేత్తకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఫలితం మరో విధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజేష్, జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, మహిళ విభాగం జిల్లా చైర్మన్ సురేఖరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణజ్యోతి, జిల్లా నాయకులు, శ్రీసత్యసాయి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యంత్రం తగిలి వృద్ధుడి మృతి



మృతుడు వేమన్న

గాండ్లపెంట: మండలంలోని జీనులకుంట గ్రామంలో అజాక్స్ యంత్రం తగిలి వి.వేమన్న గౌడ్ (75) మృతిచెందాడు. ఆయనకు భార్య చిట్టెమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. వివరాలు.. జీనులకుంటలోని ప్రాథమిక పాఠశాల వద్ద సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అజాక్స్ యంత్రంలో కంకర, సిమెంట్ వేసి కలుపుతుండగా వెనుక వైపున ఉన్న వేమన్న ఎడమ కాలుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స అందేలోపు మృతి చెందాడు. మృతుని కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఎస్వీలో ఉద్యోగ మేళా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం వివిధ బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన ఉద్యోగ మేళాలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీసీఎస్ కంపెనీకి 8 మంది, డెలాయిట్, విప్రో, హిటాచీ, హెచ్‌సీఎల్ ఎంపెనీల్లో ఒక్కొక్కరు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖరెడ్డి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏటా తమ కళాశాల విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యంలో మెలుకువలు పెంపొందించుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఏట శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.సాయిరాం పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

రాప్తాడు: జమ్మూ–కశ్మీర్‌లో ఉమ్మడి జిల్లా వీర జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడం చాలా బాధాకరమని విశ్రాంత ఆర్మీ సైనికుల జిల్లా జనరల్ సెక్రటరీ గొర్ల సుదర్శన్ రెడ్డి అన్నారు. రాప్తాడు నియోజకవర్గ విశ్రాంత ఆర్మీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా దేశం కోసం మేమందరం ఒక్కటే అనే సందేశం చాటి చెప్పడం కోసం అందరూ రావాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీ 44వ జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి నుంచి స్థానిక బస్టాండు వరకూ కొనసాగుతుందని తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ

రాప్తాడురూరల్: బాల్య వివాహాలతో చాలా అనర్థాలు చోటుచేసుకుంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ పేర్కొన్నారు. అనంతపురం రూరల్–5 సెక్టార్ పరిధిలోని విద్యారణ్యనగర్–2 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. 'పునరుత్పత్తి ఆరోగ్యం–బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు' అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేస్తే అమ్మాయికి ఆరోగ్య సంబంధిత సమస్యలు తలెత్తుతాయన్నారు. గర్భసంచి ఎదుగుదల సరిగ్గా లేకపోవడం తరచూ అబార్షన్లు జరగడం వంటివి జరుగుతాయన్నారు. ఒక్కోసారి ప్రసవ సమయంలో తల్లీబిడ్డ చనిపోయే ప్రమాదం ఉంటుందని గుర్తు చేశారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. మీ పరిధిలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే 1098 లేదా పోలీసు, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ హరిత, అంగన్వాడీ కార్యకర్తలు అరుణ కుమారి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

స.హ.చట్టంపై రేపు అవగాహన సదస్సు

అనంతపురం కల్చరల్: అధికారులు పారదర్శకంగా ఉండడం లేదని ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవడం కోసం సమాచార హక్కు చట్టంపై అందరికి అవగాహన కల్పిస్తున్నట్లు ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకు హౌసింగ్ బోర్డులోని విద్యుత్ కళావేదికలో జరిగే సమావేశానికి ఆర్టీఐ కార్యకర్తలు, యాక్టివిస్టులు తరలి రావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: సుఖ ప్రసవం కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని హైరిస్క్ గర్భిణులకు రక్త పరీక్ష, బీపీ, డయాబెటీస్, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రాప్తాడుకు చెందిన లక్ష్మీ పండమేటి వెంకటరమణ ఆలయ కమిటీ మెంబర్ బోయ నాగరాజు 80 మంది హైరిస్క్ గర్భిణులు, సిబ్బందికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్స్ నరసింహ, అరుణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఫార్మసి ఆఫీసర్ మూర్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్

- కమలానగర్‌లోని ఒకే వీధిలో ఐదు సెల్లార్ల ఏర్పాటు
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- నిబంధనలు బేఖాతరు..
- రూ.లక్షల్లో చేతులు మారినట్లు ప్రచారం
- తూతూమంత్రంగా నోటీసు జారీ చేసి వదిలేసిన అధికారులు



రోడ్డును బ్లాక్ చేసి అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు అతి సమీపంలో ఉండే కమలానగర్‌లోని ఓ వీధిలో ఐదు సెల్లార్ల నిర్మాణం చేపట్టడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కమర్షియల్ ప్రాంతంలో ఎటువంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అనధికార నిర్మాణాలు చేపడుతున్నారు. వాస్తవంగా 18 సెంట్లు ఉంటేనే సెల్లార్‌కు అనుమతులు ఉంటాయి. కానీ అక్కడ అటువంటి పరిస్థితి లేదు. కమలా నగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్ కార్యాలయం వీధిలో ఈ అడ్డగోలు బాగోతం నడుస్తోంది. పట్టణ ప్రణాళిక కార్యదర్శి తూతూమంత్రంగా నోటీసు జారీ చేసి వదిలేశారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ కీలక అధికారులు కొందరు నిర్మాణదారుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేసుకున్నట్లు సమాచారం. పలు నిర్మాణదారుల నుంచి రూ.లక్షల్లో టౌన్ ప్లానింగ్ అధికారిణికి ముట్టజెబుతున్నట్లు నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. మొదటగా డీఈఓ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఓ నిర్మాణానికి సెల్లార్ అనుమతి లేకున్నా.. పనులు చేపడుతున్నారు. అదేవిధంగా రెండు జీ ప్లస్ 3 భవనాలు, జీప్లస్ 4 భవనానికి సెల్లార్ తెరిచేశారు. షెడ్లు అడ్డం పెట్టి నిర్మాణాలు చేపట్టేశారు.

కనిపించని సెట్ బ్యాక్స్

అక్కడ నిర్మిస్తున్న ఏ భవనానికి ప్రాథమిక నిబంధనలను పాటించకపోవడం గమనార్హం. సెట్ బ్యాక్స్ వదలకుండా భవనాలకు ఆనుకుని నిర్మాణాలు చేపట్టారు. ఆ నిర్మాణాల వెనుకవైపు ఇష్టానుసారంగా నిర్మాణాలు ఉన్నాయి. పొరపాటున అగ్ని ప్రమాదం జరిగితే భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. నగరపాలక సంస్థకు కూతవేటు దూరంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే.. ఇక మిగతా ప్రాంతాల్లో చెప్పాల్సిన పనిలేదు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ మహిళా అధికారిణి కనుసన్నల్లోనే నిర్మాణాలు గుట్టుచప్పుడుగా జరుగుతున్నాయి. సదరు అధికారిణి ఏనాడు అటువైపు తొంగి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మేలుకుంటారో లేదో వేచి చూడాలి.

రోడ్డు బ్లాక్..

నిర్మాణాలు జరిగే సమయంలో సదరు నిర్మాణదారులు రోడ్డును బ్లాక్ చేశారు. ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. అందులోనూ కమలానగర్‌లో ఒక వీధిలో నుంచి మరో వీధిలోకి వెళ్లాలంటే గగనమవుతోంది. అటువంటిది రోడ్డు బ్లాక్ చేసి అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారిణి అటువైపు తొంగి చూసిన దాఖలాలు లేవు. కేవలం పట్టణ ప్రణాళిక కార్యదర్శులను పంపడం.. పలానా తెలుగు తమ్ముళ్లు సిఫార్సు చేశారంటూ నిర్మాణదారులకు ఆ మహిళా అధికారిణి వెన్నుదన్నుగా నిలుస్తోంది. పలువురు నిర్మాణదారులతో రూ.లక్షల్లో వసూలు చేసి తమకేం పట్టదన్న ధోరణిలో మహిళా అధికారిణి ఉన్నట్లు సమాచారం. ఏసీబీ అధికారులు సదరు కీలక అధికారిణిపై నిఘా ఉంచితే అసలు బాగోతం వెలుగు చూస్తుందని నగరపాలక సంస్థ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



సెట్ బ్యాక్స్ వదలకుండా నిర్మాణం చేపట్టిన దృశ్యం



అనధికారికంగా సెల్లార్ ఏర్పాటు

ఘనంగా పంచమాతృక పూజ



పూజలో పాల్గొన్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: స్థానిక తపోవనంలోని జగదీశ్వరాలయం వేదికగా శుక్రవారం సాయిట్రస్టు వారు అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా పంచమాతృక పూజ ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పురాణకాలం నుంచి తల్లి ప్రాధాన్యతను తెలిపే విధంగా అవతార పురుషులు ఉద్భవించారన్నారు. శ్రవణుడు, శ్రీరాముడు తల్లిదండ్రులే దైవంగా పూజించారని గుర్తు చేశారు. తల్లిదండ్రులను దైవసమానంగా చూసుకోవాలని సూచించారు. అనంతరం వందలాది మందికి అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో రాఘవేంద్ర, నారాయణ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



రవీంద్ర నాయుడు (ఫైల్)

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రవీంద్రనాయుడు (51) అనే వ్యక్తి గురువారం కుమారుడుతో కలసి ద్విచక్రవాహనంలో పామిడికి వెళ్తూ, పెన్నానది బ్రిడ్జి సమీపంలో ద్విచక్రవాహనం బోల్తాపడడంతో రవీంద్ర నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉగ్రవాదులను హతమార్చాలి



మసీదు ఎదుట జాతీయ జెండాలను ఎగురవేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా సాగి ఉగ్రవాదులను సమూలంగా హతమార్చాలని పలువురు ముస్లిం సంఘాల నాయకులు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలుపుతూ ఐఎంఎం ఆర్గనైజేషన్, షబ్బీర్ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పాతూరు జామియా మసీదు వద్ద మధ్యాహ్నం ప్రార్థనల అనంతరం జాతీయ జెండాలతో నినాదాలు చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉగ్రవాదం ఏనాటికైనా దేశానికి ప్రమాదకరమే అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ సిందూర్ కొనసాగించి ఉగ్రవాదాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. యావత్ భారతదేశ ప్రజలు సంఘీభావంగా నిలుస్తారన్నారు. యుద్ధ సమయాల్లో కులమతాలకు అతీతంగా అందరం ఒకటై సాగాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కేవలం కొందరు ఉగ్రవాదుల హతంతో సరిపెట్టుకోకుండా దొరికిన వారికి బహిరంగంగా ఉరితీయాలన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోకపోతే తగిన బుద్ధి చెప్పడానికి భారతదేశం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎంఎం మహబూబ్ బాషా, సమీవుల్లా, జాకీర్ బాషా, బషీర్, మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఇవ్వరా?

అనంతపురం అర్బన్: ఆర్డీటీ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి చెప్పుకునేందుకు అధికారులు అవకాశం కల్పించకపోవడం అన్యాయమని ఆర్డీటీ అఖిలపక్ష కమిటీ జేఏసీ కన్వీనర్ సాకే హరి మండిపడ్డారు. అధికారులు చర్యలను ఖండిస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రిని అఖిలపక్ష జేఏసీ నాయకులు కలిసేందుకు మూడు రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకుంటే పోలీసు, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి వచ్చిందన్నారు. తీరా ముఖ్యమంత్రి జిల్లాకు విచ్చేసిన రోజున ఆయన్ను కలిసి ఆర్‌డీటీ సమస్యపై అర్జీ సమర్పించి వివరించేందుకు వీలు కల్పించలేదన్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు ఒకరిపై ఒకరు చెప్పుకోవడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే ప్రజా, కుల సంఘాలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనేందుకు ఇదో నిదర్శనమన్నారు. సేవ్ ఆర్డీటీ నినాదంతో త్వరలో గ్రామస్థాయి నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ జేఏసీ నాయకులు కేపీ రాజు, సుగమంచి శ్రీనివాసులు, బేడ బుడగ జంగం అంజి, మల్లి, టీపీ రామన్న, భీమ్‌సేన రావు, నాగేంద్ర, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరీలో శిక్షణ

రాప్తాడు: సెల్‌ఫోన్ రిపేరీలో 30 రోజుల పాటు పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ మండలం ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థలో ఈనెల 15 నుంచి జూన్ 13వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉండాలని, శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492583484 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నమో నారసింహా..

- నేటి నుంచి రెండు రోజుల పాటు లక్ష్మీ నరసింహ స్వామి జయంతి
- కల్యాణోత్సవానికి ముస్తాబు
- ఆలయంలో ఏర్పాట్లు పూర్తి



కొలువైన నృసింహుడు

అనంతపురం కల్చరల్: అనంత జిల్లా రాష్ట్రంలోనే నరసింహ స్వామి దేవాలయాలకు ఎంతో ప్రసిద్ధి చెందినది అని పురాణ నేపథ్యముంది. కదిరి, పెన్నోహబిలం, పంపనూరు వంటి క్షేత్రాల్లో కొలువైనట్లే నగరంలోనూ నరసింహ స్వామి కొలువుదీరి పూజలందుకుంటున్నాడు. నగరం ఏర్పడిన తొలి రోజుల్లో నిర్మాణమైన చిన్నాంజనేయస్వామి ఆలయం తదుపరి నరసింహాలయంగా, వ్యాసరాజమఠంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో శనివారం నరసింహ జయంతిని కనుల పండువగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈసారి చైత్రశుద్ధ చతుర్థి శనివారం వస్తుండటంతో పాతూరు వీధుల్లో కల్యాణోత్సవం, గ్రామోత్సవాలు జరిపేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే సూర్యోదయ తిథి పాటించే వారు చాలా చోట్ల ఆదివారం నరసింహ జయంతి వేడుకలు జరుపుకుంటారు.

ఆలయ చరిత్ర ఆసక్తికరం

నగరం ఏర్పడుతున్న రోజుల్లో శివకేశవ ఆలయాలను ఆనాటి రాజులు పోటీ పడి నిర్మించారు. అయితే చాలా ఏళ్ల వరకు అన్ని దేవతామూర్తులకు ఆలయాలు ఉన్నా నరసింహస్వామికి అంటూ ప్రత్యేక ఆలయం ఉండేది కాదు. పాతూరు వీధుల్లో కొలువైన చిన్నాంజనేయస్వామి గుడిలోనే చిత్రపటం పెట్టుకుని పూజలు జరిపించేవారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని 1998లో ఎండోమెంట్ నుంచి తప్పించి వివిధ మఠాల సహకారం, భక్తుల కమిటీలతో ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహ ప్రతిష్టలు జరిగాయి. ఇదే సుందర ప్రాంగణంలో ప్రహ్లాద ప్రతిరూపమైన ఆంజనేయస్వామితో పాటూ రాఘవేంద్ర స్వామి బృందావనం, వేణుగోపాల స్వామి, వ్యాసరాయలు, మహేశ్వరుడు, నవగ్రహాలు నిత్యపూజలందుకుంటున్నాయి. ముఖ్యంగా నరసింహస్వామి వెలసిన తర్వాత ప్రతి ఏటా నరసింహస్వామి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం స్వామికి అభిషేక, అలంకార సేవలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవం నిర్వహిస్తారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రతినిధులు శ్రీకాంత్, హరినారాయణ, రఘునాథాచార్ ఆలయంలో జరిగిన సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

ఆర్డీటీని కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీని కాపాడుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాకే శైలజానాథ్ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆర్డీటీ గొప్ప లక్ష్యంతో ఏర్పడిందన్నారు. ఆర్డీటీ అందించిన సాయంతో చాలామంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఇంత గొప్ప సేవలు అందించిన విన్సెంట్ ఫెర్రర్‌ను మరిచిపోలేమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఆర్డీటీకి అడ్డంకులు తొలగి పోవాలంటే కూటమి ప్రభుత్వం ఢిల్లీలో వాదనలు వినిపించాలన్నారు. ఆర్డీటీకి మతం రంగు పులిమి అడ్డంకులు సృష్టించడం సరికాదని హితవు పలికారు. పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. అనంతలో ఆర్డీటీ లేకపోతే పేద ప్రజలు అంధకారంలోకి వెళ్లిపోతారన్నారు. ఆర్డీటీ కోసం సంపూర్ణ మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, అనిల్ కుమార్, చామలూరి రాజగోపాల్, అరుణక్క, ఆనంద్, తనీష్, నాగేంద్ర, మల్లి, దాసరి ఆదినారాయణ, సుగమంచి శ్రీనివాసులు, ఓబులేసు, కాటమయ్య, ప్రభాకర్, రామకృష్ణ, సూర్యనారాయణ, రాము, గోవర్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళి నాయక్‌కు జోహార్లు



నివాళులర్పిస్తున్న విద్యార్థినులు



నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



శాంతిర్యాలీ చేపట్టిన ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం కల్చరల్: వీర జవాన్ మురళి నాయక్ మృతి యావత్ భారతదేశానికి దిగ్భ్రాంతి కలిగించిందని మేయర్ వసీం అన్నారు. యునైటెడ్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మురళీనాయక్ మృతికి సంతాపం తెలుపుతూ ఈద్గా మసీదు నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెబుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు జాఫర్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, సైఫుల్లాబేగ్, గోల్డ్ బాషా, తాజుద్దీన్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, వలి, ఖాజామైనుద్దీన్, నాగేంద్ర, రామిరెడ్డి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్: దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్ క్లాక్ వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు పి.నారాయణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నాయకులు చందు, మంజునాథ్, నాని, సమీర్, ప్రభాస్, సబ్జాన్, తౌకిర్, మురళి పాల్గొన్నారు.

ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో..

అనంతపురం ఎడ్యుకేషన్: ఇండియా–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు రిజర్వేషన్ రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఈఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నారాయణ నాయక్, నాయకులు జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు టి.రాజా రమేష్, ఎం.ఓబులేసు, బి.రాజశేఖర్, బి.నారాయణప్ప, ఆర్.మల్లికార్జున, సాంబశివమ్మ, శ్రీరాములు, సుగుమంచి సురేష్, డి.వరదరాజులు, మహేష్ నాయక్, భీమేష్ పాల్గొన్నారు.

సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో..

అనంతపురం అర్బన్: భారతదేశం పాకిస్తాన్‌తో చేస్తున్న యుద్ధంలో జవాన్ మురళి నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధకరమని సీపీఎం నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్లాకటవర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మురళీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటనారాయణ, వలి, ప్రకాష్, ముత్తుజా, నాయకులు రాజు, శీనా, ఆదినారాయణ, ఆజాం, నాగరాజు, శంసాద్, పీటీపీ వాకర్స్ సంఘం నాయకులు శివప్రసాద్, చంద్రమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టిన సీపీఎం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీర జవాన్ మురళీ నాయక్ మృతి చెందడం విచాకరమని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప, హనుమంతరావు, చంద్రశేఖర్, నాగభూషణం, రమేష్, దేవర పుల్లన్న, మీసాల నాగభూషణం, కాష్టప్ప, కారణ్, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మురళి నాయక్‌కు నివాళి

అనంతపురం అర్బన్: పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో జవాన్ మురళి నాయక్ మరణించడంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సీపీఐ సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో విచారం వ్యక్తం చేశారు. మురళీ మృతికి సంతాపం ప్రకటిస్తూ బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఎంఈఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో..

ప్రయాణం.. నరకం

రాప్తాడు మండలం గంగలకుంట సమీపంలోని 42వ నంబర్ జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి.వాహనాలు దగ్గరకి వచ్చే వరకూ ఈ గుంతలు కనబడకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెలలో దాదాపుగా 10 మంది ద్విచక్ర వాహనాల్లో నుంచి కిందపడి గాయాల పాయ్యారు. గుంతలు పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. – రాప్తాడు:



రైల్వే వంతెన సమీపంలో రోడ్డుపై ఉన్న గుంత